సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 17 । మార్చి । 2023



వసతుల లేమి

బోధన్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నర్సింగ్ పాఠశాలలో వసతుల లేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

- 8లో ▸



పేదల ఇళ్ల నిర్మాణంలో ఫస్ట్

పేదల ఇళ్ల నిర్మాణంలో దేశంలోనే బాన్సువాడ నియోజకవర్గం మొదటిస్థానంలో నిలుస్తుందని స్పీకర్ పోచారం అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.8 /23.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రక్షణశాఖ మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిణామాలు, తదితర అంశాలపై ఆయనతో ఎంపీ చర్చించారు. అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రకు చెందిన పవన్‌రెడ్డి బీజేపీలో చేరారు. రాజ్‌నాథ్‌సింగ్ ఆయనకు కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వరల్డ్ బాక్సింగ్ పోటీల్లో నిఖత్ ముందంజ



నిజామాబాద్‌నాగారం: ఉమెన్ వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నిఖత్ ముందంజలో ఉంది. ఈ నెల 15 నుంచి 26 వరకు న్యూఢిల్లీలో బాక్సింగ్ పోటీలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన పోటీ ల్లో నిఖత్ 5–0తేడాతో ప్రత్యర్థి ఇస్తాలీయోవాఅన్‌ఖానీమ్ అనే క్రీడాకారిణిని ఓడించింది.

మహిళలు అభివృద్ధి ప్రదాతలు

- జిల్లా జడ్జి సునీత కుంచాల



ఖలీల్‌వాడి : మహిళల హక్కుల కోసం ఎన్నో తరాలు పోరాడిన ఫలితమే నేటితరం మహిళ సాధికారత అని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. విద్య, వైద్యం, వాణిజ్యం, వ్యాపారం సహా అన్ని రంగాల్లో మహిళలు పురోగమిస్తున్నారని పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని పీపీ గంగారెడ్డి హాల్‌లో గురువారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. న్యాయ వ్యవస్థలో, రాజకీయాలతో, కార్యనిర్వాహక వ్యవస్థలో, సామాజిక సేవారంగంలో మహిళలు సమున్నత స్థానానికి చేరువ అవుతున్నారన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో మహిళల శ్రమను కొలవలేమన్నారు. మహిళల సంక్షేమానికి ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసను, అణచివేతను, వివక్షను నిర్మూలించడానికి ఉన్న చట్టాలను వినియోగించుకోవాలన్నారు. అదనపు జిల్లా జడ్జి షౌకత్ జహాన్ సిద్దికి మాట్లాడుతూ మహిళల సాధికారత అనేది కుటుంబం నుంచి ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జిలు సౌందర్య, భవ్య, గిరిజ, బార్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ధాత్రి టౌన్‌షిప్ ప్లాట్ల వేలం ప్రక్రియ ప్రారంభం

సుభాష్‌నగర్: ధాత్రి టౌన్‌షిప్ ప్లాట్ల రెండో విడత వేలం పాట ప్రక్రియ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రారంభమైంది. నిజామాబాద్‌కు ఆనుకుని మల్లారం వద్ద ప్రభుత్వపరంగా అన్ని వసతులతో నెలకొల్పిన ధాత్రి టౌన్‌షిప్‌లో మొదటి విడతగా గత నవంబర్‌లో 80 ప్లాట్ల విక్రయాల కోసం బహిరంగ వేలం నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మరో 150 ప్లాట్ల విక్రయాలకు వేలం పాట నిర్వహిస్తున్నారు. శుక్ర, శనివారాల్లోనూ వేలం ప్రక్రియ కొనసాగనుంది. ఇందులోభాగంగా తొలిరోజు గురువారం షెడ్యూల్‌ను అనుసరిస్తూ ఉదయం 25 ప్లాట్లు, మధ్యాహ్నం మిగతా 25 ప్లాట్లకు ఓపెన్ ఆక్షన్ జరిగింది. ఈసందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టరేట్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, బిడ్డర్ల నుంచి ఈఎండీ ధరావత్తు రూ. 10వేల డీడీని స్వీకరిస్తూ, టోకెన్లు, దరఖాస్తు ఫారాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. టోకెన్ కలిగిన వారిని వేలంపాట జరిగే సమావేశం హాల్‌లోకి అనుమతించారు. వేలంలో పాల్గొనే బిడ్డర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్, బ్యాంకు డీడీలు తీసేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంచారు. కాగా శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న వేలం ప్రక్రియకు సకాలంలో బిడ్డర్లు పాల్గొనాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- తెలంగాణ సంక్షేమ రాజ్యం కోసం కృషి
- బోధన్‌లో హాథ్ సే హాథ్ జోడోయాత్ర కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



బోధన్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

బోధన్ : తెలంగాణలో సంక్షేమ, అభివృద్ధి రాజ్యం కోసం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోరారు. సోనియాగాంధీపై ఎన్నో ఒత్తిళ్లు వచ్చినా.. ఆంధ్రలో పార్టీ చచ్చిపోతుందని తెలిసినా.. రాజకీయ ప్రయోజనాలను ఆశించకుండా తెలంగాణ ఇచ్చి ప్రజల ఆకాంక్ష నెరవేర్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్రం దోపిడీదారులు, దొంగల చేతిలో బందీ అయిందన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం బోధన్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశాడన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి రూ. వేల కోట్ల ఆస్తులు, ఫాంహౌజ్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్, మోదీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, కుల, మతాల పేరుతో రెచ్చగొట్టి ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే జిల్లా అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లా అభివృద్ధి జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ చొరవతో మెడికల్ కాలేజీ, 500 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, తెలంగాణ యూనివర్సిటీ, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలు వచ్చాయని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో 3 లక్షల 16వేల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో ప్రాణహిత – చేవెళ్ల 20, 21 ప్యాకేజీ పనులకు రూ. 2వేల కోట్లు కేటాయించారని తెలిపారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ఎంతోమంది మైనారిటీ పిల్లలకు ఉన్నత ఉద్యోగాలు వచ్చాయన్నారు. 2014 ఎన్నికల సమయంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

ఆరు నెలల్లో షుగర్‌ఫ్యాక్టరీ తెరిపిస్తాం

తాము అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని, చెరుకు రైతులను, పసుపు రైతులకు ఆదుకుంటామని రేవంత్‌రెడ్డి అన్నారు. పసుపు క్వింటాలుకు రూ. 12 వేలు, ఇతర పంటలకు మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ. 5 లక్షలకు పెంచి ఉచిత వైద్యం అందిస్తామని, పేదలందరికి పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. రూ.రెండు లక్షల రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామన్నారు. వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందిస్తామని హామీనిచ్చారు.

వైఎస్‌కు దండం పెడితే వంద ఎకరాలు ఇచ్చారు

దివంగత సీఎం వైఎస్సార్‌కు దండం పెడితే పేదల ఇళ్ల స్థలాల కోసం వంద ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చారని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆ స్థలం పేదలకు పంపిణీ చేయగా మిగిలిన స్థలాలను ఎమ్మెల్యే షకీల్ సోదరుడు కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలోనే ఏకైక మైనారిటీ ఎమ్మెల్యే షకీల్ మైనార్టీల సంక్షేమం కోసం అసెంబ్లీలో మాట్లాడతారని ఆశించామని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. కానీ ఆయన దొంగ పనులతో భయపడి మాట్లాడడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సెక్యులర్ నినాదం ముసుగులో ముస్లింలను మభ్యపెట్టి మోసం చేస్తోందని, బీజేపీ కంటే బీఆర్‌ఎస్ ప్రమాదకరంగా ఉందని వ్యాఖ్యానించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు మల్లు రవి, గడుగు గంగాధర్, అంజనీ కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగ పనుల్లో ఎమ్మెల్యే షకీల్

బోధన్ ఎమ్మెల్యే షకీల్‌పై రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. ఇసుక, బియ్యం, భూ కబ్జాలు, దొంగ పాస్‌పోర్టు లాంటి దొంగ దందాల్లో షకీల్ బీజీ అయి, నియోజకవర్గ ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఓ రైతు భూమి అమ్ముకుంటే కమీషన్ల కోసం రిజిస్ట్రేషన్‌ను అడ్డుకున్నాడని ఆరోపించారు.

పేరుకే లక్కంపల్లి సెజ్



లక్కంపల్లి సెజ్ ఇదే..

- తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఒక్క యూనిట్ రాని దుస్థితి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దివంగత మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సమున్నత ఆశయంతో ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట మండలం లక్కంపల్లి వద్ద ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెజ్ ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా ఉండడంతో పాటు వైవిధ్యమైన పంటలతో మంచి దిగుబడులు సాధిస్తుండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే ఉద్దేశ్యంతో వైఎస్సార్ ఈ సెజ్‌ను నెలకొల్పారు. ఇందులో భాగంగా 2008లో లక్కంపల్లి వద్ద 437.05 ఎకరాలు సేకరించేందుకు నిర్ణయించారు. అయితే కొంత పనికిరాని భూమి ఉండడంతో 371.17 ఎకరాలు సేకరించారు. ఇందులో 171.17 ఎకరాలు స్మార్ట్ ఆగ్రోకు అమ్మకం చేశారు. ఇందులో పసుపు కర్కుమిన్ యూనిట్ ఏర్పాటు చేశారు. తర్వాత మరో 6 గోదాములు ఏర్పాటయ్యాయి. మరో 200 ఎకరాలు ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్నాయి. కాగా వైఎస్సార్ మరణానంతరం కానీ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కానీ ఇప్పటివరకు ఒక్క యూనిట్ కూడా ఇందులో ఏర్పాటు చేయలేదు. ఇందులో ప్రస్తుతం భూముల ధరలు అమాంతం పెంచడంతో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే రెండేళ్ల కిందట మంత్రి గంగుల కమలాకర్ మేనల్లుడు ఇక్కడ ఒక పెన్సిల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసినప్పటికీ అది మూతపడింది. కాగా పలువురు పెట్టుబడిదారులు ఇక్కడ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ, ఇక్కడకు వచ్చాక పరిస్థితులు చూసి విముఖత చూపుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మంజీరలో ఇసుకను తోడేస్తున్న ఎమ్మెల్యే

- సోదరుడితో కలిసి షుగర్ ఫ్యాక్టరీ భూముల అమ్మకాలు
- మహిళలను అక్రమ రవాణా చేసిన ఘనుడు
- ఎఫ్‌సీఐకి నకిలీ ట్రక్ షీట్లు ఇచ్చి రూ. 120 కోట్ల ధాన్యం మాయం
- షకీల్‌పై కాంగ్రెస్ పార్టీ చార్జ్‌షీట్ విడుదల



ఎమ్మెల్యే షకీల్‌పై చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎడపల్లి(బోధన్): మంజీర నదిలో ఇసుక మాఫియాకు ఎమ్మెల్యే షకీల్ తెరలేపినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లురవి అన్నారు. ఎడపల్లి మండలం సాటాపూర్‌లోని రేవంత్‌రెడ్డి క్యాంపులో బోధన్ నియోజకవర్గానికి చెందిన నేతలతో కలిసి ఎమ్మెల్యే షకీల్‌పై చార్జ్‌షీట్ విడుదల చేశారు. అనంతరం మల్లురవి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే సోదరుడు సోహెల్‌తో కలిసి షుగర్ ఫ్యాక్టరీ భూములు, బోధన్ రూరల్ మండలంలోని భూముల కబ్జాకు పాల్పడినట్లు ఆరోపించారు. రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి పక్క రాష్ట్రాలకు తరలించాడని, పేదలకు చెందాల్సిన బియ్యం అందడం లేదన్నారు. అమాయక పేద ఆడబిడ్డలను దుబాయ్‌కి అక్రమ రవాణా చేస్తూ వ్యభిచార కూపంలోకి నెట్టే దందాలో ఎమ్మెల్యే షకీల్ పాత్ర ఉందన్నారు. యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని వారి నుంచి డబ్బులు తీసుకొని వారికి నకిలీ పాస్‌పోర్టులతో వారిని మోసం చేశారని ఆరోపించారు. గల్ఫ్ దేశాల్లో ఉండి ఎమ్మెల్యే ఏజెంట్లు ఎంతో మంది యువకులను మోసం చేశారన్నారు. మంగళ్‌పాడ్ చౌరస్తా వద్ద పేదల ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన 28 ఎకరాల భూమిని ఎమ్మెల్యే ఆక్రమించారన్నారు. అలాగే అనిల్ థియేటర్‌కు చెందిన ఎకరం భూమిని మున్సిపల్ చైర్మన్ శరత్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు సోహెల్ కబ్జా చేశారని ఆరోపించారు. అంతేకాకుండా సీఎంఆర్‌ఎఫ్, ట్రాక్టర్ సబ్సిడీలో కమీషన్లు తీసుకున్నాడన్నారు. ఇటీవల ఎఫ్‌సీఐ నుంచి నకిలీ ట్రాక్ షీట్లు ఇచ్చి రూ. 120 కోట్ల ధాన్యాన్ని నొక్కేసినట్లు ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ. 2.5 లక్షలు, దళిత బంధువుకు రూ. 4 లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. బోధన్‌లో దుకాణాదారుల నుంచి వసూళ్లు చేస్తున్నారని, రంజాన్ తోఫా కోసం కిరాణా వ్యాపారి నుంచి రూ. 35లక్షల సామాను తీసుకొని చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. బోధన్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు మాధవనగర్ వద్ద రైల్వే ట్రాక్ నిర్మిస్తానని మోసం చేశారని తెలిపారు. ఎడపల్లి రైల్వేట్రాక్ వద్ద బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని, దీనికి ఎమ్మెల్యే కమీషన్లు అడుగుతున్నారని ఆరోపించారు.

చార్జ్‌షీట్‌కు దూరంగా సుదర్శన్‌రెడ్డి

ఎమ్మెల్యే షకీల్‌పై కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి డుమ్మా కొట్టారు. ఎమ్మెల్యేపై చార్జ్‌షీట్ సమయంలో సుదర్శన్‌రెడ్డి లేకపోవడంతో నియోజక వర్గంలో చర్చనీయాంశంగా మారింది.

నగరానికి 'పన్ను'పోటు

నగరంలో బల్దియా ఆధ్వర్యంలో పన్ను వసూలు ప్రక్రియ ప్రహసనంగా మారింది. మున్సిపల్ యంత్రాంగం అలసత్వం, కొన్ని వ్యాపార సంస్థల నిర్లక్ష్యం వెరసి బకాయిలు రూ. కోట్లల్లో పేరుకుపోయాయి. దీంతో బల్దియా ఖాజానాకు కాసులు రావడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తుల పన్ను వసూళ్లు కార్పొరేషన్‌కు తలనొప్పిగా మారాయి.

- గుదిబండగా మారిన ప్రభుత్వ శాఖల ఆస్తి పన్ను బకాయిలు
- జీజీహెచ్ బకాయి రూ. 8 కోట్లపైనే..
- వ్యాపార సంస్థల నుంచి రావాల్సింది రూ. 12 కోట్లు
- సామాన్యుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు
- బడాబాబులను వదిలేస్తున్న వైనం



బకాయిలు ఇలా.. (రూ. కోట్లలో..)

150 ప్రభుత్వ శాఖలు	20
నివాస గృహాలు	11
రెండు స్టార్ హోటళ్లు	09
స్వీట్‌హోం	0.50
ఇతర వ్యాపార సంస్థలు	2.50
మొత్తం బకాయిలు	43.00

నిజామాబాద్‌నాగారం: నగరంలో ఆస్తి పన్ను వసూళ్లు ఒక్కో వర్గానికి ఒక్కో పద్ధతి అన్నట్లుగా సాగుతున్నాయి. పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వద్ద ముక్కుపిండి, బెదిరించి మరీ ఆస్తి పన్ను వసూలు చేస్తున్న అధికారులు.. కొన్ని ప్రైవేటు వ్యాపార సంస్థలు, ప్రభుత్వ శాఖల నుంచి మాత్రం ఆస్తి పన్ను వసూలు చేయలేకపోతున్నాయి. కొన్నేళ్లుగా వ్యాపారసంస్థలు పన్ను ఎగ్గొట్టి దర్జాగా తమ వ్యాపారాలు చేసుకుంటున్నారు. అలాగే నగరంలో సుమారు 150కి పైగా ప్రభుత్వ శాఖలు రూ. 20 కోట్లకు పైగానే ఆస్తిపన్ను బకాయిలున్నా తమను అడిగేవారెవరు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు.

కోర్టుకు వెళ్లడంతో..

నగరంలోని స్టార్ హోటళ్లు ప్రతి ఏడాది ఆస్తి పన్ను కట్టకుండా మొండికేస్తున్నాయి. ముందుగా ఫంక్షన్ హాల్ కడతామని, తర్వాత హోటళ్లు కట్టారని.. అలాగే పన్నులు కట్టాలని వారికి మున్సిపల్ అధికారులు నోటీసులివ్వగా పన్నులు కట్టడంతో తాత్సారం చేస్తూ వారు కోర్టుకెక్కారు. ఇలా నగరంలో రెండు వ్యాపార సంస్థల ద్వారానే రూ. 9 కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. అలాగే నగరంలో ఓ ప్రధాన స్వీట్‌హోమ్ రూ. 50లక్షలపైనే బకాయి ఉంది. ఇలా ప్రైవేటు బకాయిలు మొత్తంగా రూ.12 కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు ఉంటున్నాయి.

సాక్షాత్తు కలెక్టరేట్ కూడా బకాయిదారే..

ప్రభుత్వ శాఖ నుంచి ప్రతి ఏడాది ఆస్తి పన్ను వసూ ళ్లు చేయాల్సి ఉంది. అయితే సంబంధిత మున్సిపల్ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రభుత్వం బడ్జెట్ ఇస్తేనే తాము పన్ను కడతామని తెగేసి చెబుతున్నారు. దీంతో నాలుగేళ్లుగా అన్ని శాఖలకు కలిపి రూ. 20 కోట్ల పైనే బకాయిలున్నాయి. ఇందులో ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ (ప్రభుత్వ ఆస్పత్రి) నుంచే రూ. 8 కోట్ల వరకు రావాల్సి ఉంది. కలెక్టరేట్, విద్యుత్, ఆర్టీఏ తదితర అన్ని శాఖలకు సంబంధించి మరో రూ. 12 కోట్ల వరకు ప న్ను రావాల్సి ఉంది. ఏళ్ల తరబడిగా పన్నులు మాత్రం వసూలు చేయడం లేదు. అదే సామాన్యులను మాత్రం సిబ్బంది వేధించి మరీ పన్నులు వసూలు చేస్తున్నారు. నెల ఆలస్యమైనా మున్సిపల్ ఆర్‌ఐలు ఇళ్ల ముందు వాలిపోతున్నారు. పన్ను కట్టకపోతే సామాన్లు తీసుకెళ్తామని బెదిరిస్తున్నారు.

సామాన్యులే కడుతున్నారు..

నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 60 డివిజన్లు, 97వేల నివాసాలు, 3,95,000 గృహాలున్నాయి. ప్రతి ఏడాది ఇళ్లకు సంబంధించి ఆస్తిపన్నును మున్సిపల్ రెవెన్యూ శాఖ క్రమం తప్పకుండా వసూలు చేస్తోంది. ఈ ఏడాది రూ. 47 కోట్ల టార్గెట్ పెట్టుకుని వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ. 36 కోట్ల వరకు వసూలయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఈనెల చివరికల్లా మరో రూ. 5కోట్ల వరకు వసూలయ్యే అవకాశముందంటున్నారు.

నోటీసులు ఇచ్చాం

ప్రభుత్వశాఖలకు సంబంధించి బకాయిలు వసూళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. కమిషనర్ అనుమతి మేరకు శాఖలకు నోటీసులు ఇచ్చాం. బడ్జెట్ వస్తే బకాయిలు చెల్లిస్తామని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాన్ని అందుకోవడానికి ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచుతున్నాం.

– నరేందర్, మున్సిపల్ రెవెన్యూ ఆర్‌ఐ

అక్రమ పదోన్నతులు..

- తెయూలో అర్హత లేకున్నా పోస్టులు
- వర్సిటీ ఉన్నతాధికారుల బరితెగింపు



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో డెయిలీవైజ్ లేబర్ పేరిట అక్రమ నియామకాలు చేపట్టిన వర్సిటీ ఉన్నతాధికారులు మరోవైపు అక్రమంగా పదోన్నతులకు తెరలేపారు. పాలకమండలి (ఈసీ) ఆదేశాలను బేఖాతరు చేస్తూ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిలో కొందరికి అర్హత లేకున్నా అక్రమ పదోన్నతులు ఇచ్చారు. ఈ వ్యవహారంలో రూ. లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2021 నవంబర్ 27న తెయూ పాలకమండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో అప్పటి కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిత్తల్ 'అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పదోన్నతులు ఇవ్వరాదని', 'ప్రభుత్వ అనుమతి లేకుండా ఎలాంటి నియామకాలు చేపట్టరాదని' స్పష్టంగా తెలిపారు. అప్పటికే అక్రమంగా నియమించిన సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ఏడాది తర్వాత ఈసీ ఆదేశాలను బేఖాతరు చేసిన వర్సిటీ ఉన్నతాధికారులు మళ్లీ డెయిలీవేజ్ లేబర్ పేరిట జనవరి నుంచి సుమారు 135 మందికి పైగా సిబ్బందిని అక్రమంగా నియమించారు. దీనికి తోడు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిలో ఆరుగురు అటెండర్లకు జూనియర్ అసిస్టెంట్‌లుగా, ఇద్దరికీ సీనియర్ అసిస్టెంట్‌లుగా, ఆరుగురికి ప్రోగ్రామర్‌లుగా నెలక్రితం అక్రమ పదోన్నతులు ఇచ్చారు.

గత ఈసీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో నియమించిన కమిటీ విచారణ జరిపి ఇప్పటికే అదనపు సిబ్బంది ఉన్నారని, పదోన్నతులతో సంబంధం లేకుండా అవసరమున్న విభాగాల్లో వారి అర్హతను బట్టి పని చేయించుకోవాలని సిఫా ర్సు చేసింది. అయితే వర్సిటీ ఉన్నతాధికారులు ఈసీ ఆదేశాలు, కమిటీ నివేదికలను పట్టించుకోకుండా ఏడాది క్రితమే వీరికి పదోన్నతులు కల్పించినట్లు పేర్కొంటూ బకాయి వేతనాలు వారి ఖాతాలో వేసినట్లు వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి. పదోన్నతులు పొందిన సిబ్బందికి చెల్లించిన డబ్బులను ఖాతా నుంచి డ్రా చేసి తనకు తెచ్చి ఇవ్వాలనే ముందస్తు ఒప్పందంతో వర్సిటీ ఉన్నతాధికారులు అక్రమానికి తెరలేపినట్లు వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. గతంలో కాంట్రాక్టు విధానంలో ప్రోగ్రామర్‌గా పని చేసిన మహిళా ఉద్యోగికి సరైన అర్హత లేదని ఆమెను అవుట్‌సోర్సింగ్‌కు మార్చి జూనియర్‌అసిస్టెంట్ వేతనం ఇచ్చి పని చేయించుకోవాలని ఈసీ సమావేశంలో తీర్మానించారు. దీంతో ఆమె కొన్ని నెలలు తగ్గించిన వేతనం తీసుకోలేదు. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు యథావిధిగా ఆమెకు ప్రోగ్రామర్‌గా వేతనం చెల్లిస్తున్నారు. వర్సిటీ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తూ డబ్బుల కోసం వర్సిటీ ఉన్నతాధికారులు అక్రమ నియామకాలు, అక్రమ పదోన్నతులు చేపట్టడంపై పాలకమండలి సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అక్రమాలపై రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేశారు. అక్రమ నియామకాలు, పదోన్నతుల విషయమై ఫిర్యాదులందడంతో ఉన్నత విద్యాశాఖ ఫిబ్రవరి 20న అన్ని వర్సిటీలకు నియామకాలు, పదోన్నతులు చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉన్నతాధికారులు 2014 తర్వాత నియమించిన టీచింగ్, నాన్–టీచింగ్ సిబ్బందిని ఈ నెల 6న తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెయూలో మాత్రం అక్రమ నియామకాలు, పదోన్నతులు కొనసాగిస్తుండటం పట్ల రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా

పరీక్షా కేంద్రం తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం జరిగిన పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షల్లో 462 మంది విద్యార్థులకు 432 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 562 మంది విద్యార్థులకు 519 పరీక్షకు హాజరు కాగా 43 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. వర్సిటీ కంప్యూటర్ సైన్స్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్ అరుణ సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి ఉన్నారు.

27 నుంచి లా మొదటి సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని సూచించారు.

18న క్రికెట్ క్రీడాకారిణుల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: హిందూస్తాన్ యునిలివర్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో అండర్–24 విభాగంలో క్రికెట్ క్రీడాకారిణులకు ఈ నెల 18న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజీ ఆవరణలో కొత్తగా నిర్మించి క్రికెట్ క్యాంపులో ఉదయం 8.15 గంటలకు ఆసక్తి ఉన్న యువతులు రిపోర్టు చేయాలన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోయేసిషన్, హెచ్‌యూఎల్ నుంచి ప్రతినిధులు వస్తారని, వారి సమక్షంలో ఎంపికలు జరుగుతాయన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల్, ఆసిఫాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాల క్రీడాకారులకు ఇక్కడ ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన వారికి మూడేళ్ల పాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తామని వివరించారు. వివరాలకు మేనేజర్ 9849202586ను సంప్రదించాలన్నారు.

18న క్రికెట్ క్యాంపు ప్రారంభం

ఈ నెల 18న జీజీ కళాశాల ఆవరణలో క్రికెట్ కోచింగ్ క్యాంపును ప్రారంభించనున్నారు. గతంలో ఎంఎస్ఆర్ మైదానంలో క్యాంపు ఉండేదని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘ఎవరి దగ్గర డబ్బులు వసూలు చేయలేదు’

మోర్తాడ్: లండన్, ఆస్ట్రేలియా దేశాలకు పంపిస్తామని ప్రచారం చేసినప్పటికీ ఎవరి వద్ద డబ్బులను వసూలు చేయలేదని దేవి కన్సల్టెన్సీ ప్రతినిధి దేవేందర్ వెల్లడించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. దేవి కన్సల్టెన్సీ పేరుపై లైసెన్స్ తీసుకొని వీసాల జారీ చేయలనుకున్నామని ఈ ప్రక్రియ ఆలస్యం అయిందని చెప్పారు. ముందస్తుగా గ్రామాల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం చేసినా.. ఎవరి నుంచి డబ్బు, పాస్‌పోర్టులు తీసుకోలేదన్నారు. ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమేనన్నారు.

నర్సింగ్ పాఠశాలలో వసతుల లేమి

- సొంత భవనం లేక ఇబ్బందులు
- కనిపించని విద్యార్థుల వసతి గృహం



బోధన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నర్సింగ్ పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

బోధన్‌టౌన్: బోధన్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నర్సింగ్ పాఠశాలలో వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలను ఏర్పాటు చేసి 13 ఏళ్ల గడుస్తున్నా ఇంత వరకు సొంత భవనం లేదు. బోధన్ ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ పాఠశాలను ఏర్పాటు చేశారు. నూతన భవనం లేక పోవడంతో ఆస్పత్రిలోనే గదులను కేటాయించి పాఠాలు బోధిస్తున్నారు. పాఠాలు బోధించడానికి పూర్తి స్థాయిలో ట్యూటర్‌లను సైతం ప్రభుత్వం నియమించడం లేదు. నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ కాలంలో ల్యాబ్ ఖచ్చింగా కావాల్సి ఉండడంతో ఆస్పత్రిలోనే మరో గదిని ల్యాబ్‌గా మార్చి కాలం వెల్లదీస్తున్నారు. ఆ ల్యాబ్‌లో పూర్తిస్థాయిలో పరికరాలు లేనందున ప్రాక్టికల్స్ సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

గదుల కొరత

నర్సింగ్ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే ఐదు గదుల్లో తరగతుల నిర్వహణ సాగింది. ఇటీవల కాలంలో ఆస్పత్రిలో పలు వసతులు ఏర్పాటు చేయడంతో గదుల కొరత వచ్చి పాఠశాలకు కేటాయించిన గదుల్లో నుంచి రెండింటిని ఆస్పత్రి వర్గాలు తీసుకున్నాయి. దీంతో నర్సింగ్ పాఠశాల నిర్వహణకు మూడు గదులు మాత్రమే మిగిలాయి. దీనికి తోడు వసతి గృహం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మొదట్లో విద్యార్థుల సౌకర్యార్థం సంక్షేమ వసతి గృహంలో వసతి కల్పించి నెట్టుకొచ్చారు. అక్కడి నుంచి పాఠశాలకు రావడానికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన అధికారులు ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఇళ్లను వసతి గృహంగా మార్చారు. మెస్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నెలకు రూ.రెండు వేలు ఇచ్చి వంట చేయించుకుంటున్నారు.

విన్నవించినా ఫలితం లేదు

నర్సింగ్ పాఠశాలకు సొంత భవనం, వసతి గృహం కోసం స్థలం కేటాయించాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. సొంత భవనం కోసం స్థలాన్ని కేటాయిస్తామని చెప్పినా హామీలు అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు స్పందించి పాఠశాలకు సొంత భవనంతో పాటు, వసతి గృహం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరతున్నారు.

సొంత భవనం కోసం విన్నవించాం

నర్సింగ్ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థులకు వసతి గృహం, మెస్ లేక దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సొంత భవనం మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాము.

– శాంతి, నర్సింగ్ పాఠశాల ప్రిన్సిపాల్

ఇబ్బందులు తప్పడం లేదు



నర్సింగ్ పాఠశాలకు సొంతంగా వసతి గృహం లేకపోవడంతో, వైద్య సిబ్బంది క్వార్టర్లలో వసతి ఏర్పాటు చేశారు.అందులో పూర్తిస్థాయి సౌకర్యాలు లేవు. హాస్టల్‌తో పాటు, ల్యాబ్ ఇతర వసతులు ఏర్పాటు చేయాలి.

– బి సావిత్రి, నర్సింగ్ పాఠశాల విద్యార్థిని

మెస్ ఏర్పాటు చేయాలి



మెస్ లేక విద్యార్థులే డబ్బులు ఇచ్చి వంట చేయించుకొని తినే పరిస్థితి నెలకొంది. ఒక్కో విద్యార్థి నెలకు రూ.2000 వేసుకొని వంట చేయించుకుంటున్నాము. అధికారులు స్పందించి మెస్ ఏర్పాటు చేయాలి.

– లక్ష్మణ్, విద్యార్థి

మహిళలు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

తెయూ(డిచ్‌పల్లి): భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులను, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ సెమినార్ హాల్‌లో వర్సిటీ ఉమెన్ సెల్ డైరెక్టర్ అపర్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ప్రసంగించారు. విద్యార్థినులు ఉన్నత చదువులు చదివి తమకిష్టమైన రంగంలో రాణించాలని సూచించారు. నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. వీసీ రవీందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని అన్నారు. యూనివర్సిటీలో ఈ ఏడాది అడ్మిషన్లలో 80 శాతం బాలికలు ఉండడం గొప్ప విషయమన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, కంట్రోలర్ అరుణ, లావణ్య, త్రివేణి, జవేరియా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



తెయూ(డిచ్‌పల్లి): న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు భారత రాజ్యాంగం, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అప్పుడే న్యాయమూర్తులకు కేసు విషయాలను వివరించగలరని క్రిస్టు జయంతి లా కాలేజ్ (బెంగుళూరు) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బొల్లా మోహన్ రావు సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ లా కాలేజ్‌లో లీగల్ ఎయిడ్ సెల్ డైరక్టర్ జెట్లింగ్ ఎల్లోసా అధ్యక్షతన గురువారం న్యాయ శాస్త్ర విద్యార్థులు, ప్రజలకు చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయ శాసనాల్లో కొన్ని రకాలైన తప్పులు ఉన్నాయని, దీనివల్ల పలు క్రిమినల్ కేసులలో ముద్దాయిలు శిక్ష లు తప్పించుకుంటున్నారని తెలిపారు. మన దేశ సుప్రీంకోర్టు పలు కేసులలో దీనిని గుర్తించి ప్రస్తావించిందని, సవివరంగా ఉదాహరణలతో వివరించారు. లా కాలేజ్ ప్రిన్సిపాల్ కే.ప్రసన్నరాణి, విభాగాధిపతి బి.స్రవంతి, అధ్యాపకులు రామలింగం, నర్సయ్య, ప్రవీణ్, విద్యార్థులు, న్యాయవాదులు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఐ మార్క్ ఉంటేనే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్

నిజామాబాద్‌నాగారం: వినియోగదారులు వస్తువులు, తినుబండరాలు ఏదైనా సరే కొనుగోలు చేసే ముందు కచ్చితంగా ఐఎస్ఐ, ఆగ్మార్క్, హాల్ మార్క్ ఉంటేనే కొనుగోలు చేయాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావర్ రాజేశ్వర్ తెలిపారు. గురువారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్‌లో గల తన కార్యాలయంలో వినియోగదారుల అవగాహన చైతన్య సదస్సు నిర్వహించారు. వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తీసుకోవాలన్నారు. వినియోగదారుల సంఘం ప్రతినిధులు రమేష్, రంజిత్, మహేందర్ గౌడ్, లింగం, శేఖర్ యాదవ్, సుదర్శన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



నగరంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ పరీక్షలు రెండో రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. సెకండియర్ విద్యార్థులకు పరీక్ష జరిగింది. కలెక్టర్ రాజీవ్ హనుమంతు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఖలీల్‌వాడిలో గల ఎస్ఎస్ఆర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి అందుబాటులో ఉందా లేదా అని గమనించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

636 మంది గైర్హాజరు

ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో మొదటి రోజు 636 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 16,355 మంది విద్యార్థులకు 15,719 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. డీఐఈవో రఘురాజ్ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు.

మహిళ పర్సు చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలోని వైష్ణవి హాస్పిటల్‌లో ఓ మహిళ పర్సును బుర్కా ధరించి వచ్చిన ఇద్దరు మహిళలు చోరీ చేశారు. ఒకటో టౌన్ ఠాణా ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు కథనం ప్రకారం.. బోర్గాం(పి) గ్రామానికి చెందిన జన్నబాయి ఆస్పత్రిలో చూపెట్టుకోడానికి వచ్చింది. ఆమె పర్సును బుర్కాలో ధరించి వచ్చిన ఇద్దరు ఎత్తుకెళ్లారు. ఆ పర్సులో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు ఉన్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాచారెడ్డి: కామారెడ్డి–సిరిసిల్ల సరిహద్దులో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మాచారెడ్డి ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడి వయసు 60 నుంచి 65 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

శ్రీరామారావ్ మహరాజ్ బోధనలు పాటించాలి



భోగ్‌బండార్‌లో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్

బాన్సువాడ రూరల్: గిరిజనులు శ్రీరామారావ్ మహరాజ్ సూచించిన భక్తి మార్గాన్ని అనుసరిస్తూ, గురువు బోధనలను పాటించాలని శ్రీసంత్ సేవాలాల్ దీక్షా గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ సూచించారు. గురువారం రాంపూర్ తండాలో శ్రీరామారావ్ మహరాజ్ విగ్రహాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. రామారామ్‌మహారాజ్ బోధనలతో గిరిజనుల జీవితాలు బాగుపడ్డాయన్నారు. అంతకు ముందు వేదపండితులు హోమం, భోగ్‌భండార్, ప్రత్యేక పూజలు చేశారు. ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ బద్యానాయక్, వైస్ ఎంపీపీ హరిసింగ్, సర్పంచ్ లలితా శ్రీనివాస్, నాయకులు మోహన్‌నాయక్, అంబర్‌సింగ్, గోప్యానాయక్, ప్రకాష్, రవిచవాన్, మోహన్, రాములురాథోడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాస్‌నగర్ హాస్టల్ విద్యార్థులకు వైరల్ ఫీవర్

నిజామాబాద్‌సిటీ: మాక్లూర్ మండలం దాస్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన హాస్టల్ విద్యార్థులు గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లో వివిధ గ్రామాలకు చెందిన బాలికలు ఉంటున్నారు. వీరిలో 30 మంది అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ వార్డెన్ వీరిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు బాలికలకు వైరల్ ఫీవర్ సోకిందని తెలిపారు. జలుబు, జ్వరం ఉండటంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసేందుకు ఆస్పత్రి వర్గాలు ఏర్పాటు చేశాయి. బాలికలు ఆస్పత్రిలో ఉండమని చెప్పటంతో మందులు ఇచ్చి పంపించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను సంప్రదించగా బాలికల పరిస్థితి మామూలుగానే ఉందన్నారు.

బర్కత్‌పుర టీచర్ సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: నగరంలో బర్కత్‌పుర ప్రైమరీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సవితను డీఈవో దుర్గాప్రసాద్ సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజులుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆకస్మిక తనిఖీకి వెళ్లి డీఈవో టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంఈవో రామారావుతో నివేదిక తెప్పించుకొని సస్పెండ్ చేశారు.

చోరీ కేసుల్లో ఇద్దరికి జైలు

కామారెడ్డిటౌన్: కామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన ఇద్దరికి జిల్లా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన కర్దే లింగం అలియాస్ ఎరుకల శ్రీను, అదే కాలనీ చెందిన మరో వ్యక్తి కిందిగల్లి రాజు రెండు వేర్వేరు దొంగతనాల కేసులో నిందితులు. విచారణ అనంతరం కర్దే లింగంకు 8 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా, కిందిగల్లి రాజుకు నాలుగు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ కామారెడ్డి జుడీషియల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఎస్‌హెచ్‌వో నరేష్, ఎస్సై రాములు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో బాన్సువాడ ఫస్ట్

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: పేదల ఇళ్ల నిర్మాణంలో దేశంలోనే బాన్సువాడ నియోజక వర్గం మొదటి స్థానంలో నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు మండల కేంద్రంలో గురువారం ఆయన బిల్లులు పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రుద్రూర్ మండలానికి హౌసింగ్ బిల్లు రూ.7.75 కోట్లు విడుదలైనట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికి ఇళ్లు అందేలా చూస్తామన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ సంజీవ రెడ్డి, హౌసింగ్ డీఈ నాగేశ్వర్‌రావ్, తహసీల్దార్ ముజీబ్, తోట సంగయ్య పాల్గొన్నారు.

కోటగిరిలో..

కోటగిరి మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బిల్లులు అందచేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. జెడ్పీటీసీ శంకర్ పటేల్, రైతుబంధు అధ్యక్షుడు కిశోర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ హమీద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్ పాల్గొన్నారు.



రుద్రూర్‌లో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఎస్సారెస్పీ దిగువన కొండచిలువలు



ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న కొండచిలువ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్ట దిగువన ఫీజోమీటర్ కుండీలో మూడు కొండ చిలువలు గురువారం కలకలం సృష్టించాయి. ప్రాజెక్ట్ నుంచి సీపేజ్ వాటర్ వెళ్లడానికి ఫీజోమీటర్లను ఆనకట్ట దిగువన నిర్మించారు. వాటికి సిమెంట్‌తో కుండీలను నిర్మించారు. కుండీల్లో సుమారు ఏడున్నర ఫీట్ల పొడువుతో ఉన్న మూడు కొండ చిలువలు ఉన్నాయి. అటు వైపు వంట చెరుకు కోసం వెళ్లిన వారు గమనించి, పోచంపాడ్ సర్పంచ్ మిస్బావొద్దీన్‌ను సమాచారం అందించారు. ఆయన ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ స్పెషల్ బీట్ ఆఫీసర్ సురేశ్ ఆధ్వర్యంలో వాటిని పట్టుకోవడానికి యత్నించగా ఒకటి మాత్రమే దొరికింది. మిగతా రెండు కుండీలోని పైపుల్లోకి వెళ్లిపోయాయి. దీంతో ప్రాజెక్ట్ పరిసర ప్రాంతా ప్రజలు, రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు స్వాగతం



ఎన్నికల కమిషనర్ పార్థసారథికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



కలెక్టర్, ఇతర అధికారులతో చర్చిస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్

డిచ్‌పల్లి: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథికి జిల్లా ఉన్నతాధికారులు గురువారం స్వాగతం పలికారు. డిచ్‌పల్లిలోని బెటాయలిన్ గెస్ట్‌హౌస్ వద్దకు చేరుకున్న కమిషనర్‌కు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాస్‌రావు, ఆర్డీఓ రవి తదితరులు స్వాగతం పలికి పూల మొక్కలు, బొకేలు అందించారు. కలెక్టర్, ఇతర అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అక్కడే కొద్దిసేపు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అంతకు ముందు ఎన్నికల కమిషనర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



తెయూ ప్రధాన గేటు ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు క్యాంపస్ ప్రధాన గేటు ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. జాతీయ రహదారిపై విద్యార్థుల రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులను ఆందోళన విరమించాలని కోరారు. ఎంతకీ విద్యార్థి నాయకులు విన్పించుకోకపోవడంతో డిచ్‌పల్లి సీఐ డి మోహన్, ఎస్సై కె గణేష్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ నాయకులతో పాటు కొందరు విద్యార్థులను బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో సీఐ చేతికి గాయమైంది. దీంతో ఆగ్రహానికి గురైన పోలీసులు 14 మందిపై కేసులు నమోదు చేశారు. వారికి 41 సీఆర్పీసీ కింద నోటీసులు ఇచ్చి రాత్రి క్యాంపస్‌కు పంపించారు. విద్యార్థులను రాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచడం, కేసులు నమోదు చేయడంపై వర్సిటీ వర్గాలు విమర్శిస్తున్నాయి. విద్యార్థులను పోలీసులు పట్టుకెళ్లి, కేసులు నమోదు చేస్తే వర్సిటీ వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని స్పందించపోవడంపై విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కనుల పండువగా కల్యాణం



నర్సింగ్‌పల్లిలో కల్యాణ మహోత్సవంలో తాళిబొట్టు చూపుతున్న వేద పండితులు



ఉత్సవాల్లో దిల్ రాజు తదితరులు

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం 4వ రోజు ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. స్వామి వారి కల్యాణమంటే లోక కల్యాణమని, స్వామి కల్యాణం తిలకిస్తే సకల పాపాలూ తొలగిపోతాయని దేవనాథ జీయర్ స్వామి పేర్కొన్నారు. ఉదయం యజ్ఞ కార్యక్రమం ముగిసిన తర్వాత స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై వేంచేయగా, నూతనంగా చేయించిన రథంపై స్వామి వారిని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి, దిల్ రాజు, నర్సింహారెడ్డి, విజయసింహ రెడ్డి, శిరీష్, సర్పంచ్ సాయారెడ్డి, ఎంపీటీసీ రాములు, రవీందర్ యాదవ్, నర్సారెడ్డి, ప్రసాద్, రాజేశ్వర్, యజ్ఞాచార్యులు లక్ష్మణాచార్యులు, సంపత్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, నరసింహ మూర్తి స్వామి పాల్గొన్నారు.